గిరిజనాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- రూ.6.50కోట్ల వ్యయంతో 8.50 కి.మీ రెండు బీటీ రోడ్ల పనులకు శ్రీకారం



కుమ్మరిగుంట వద్ద బీటీ రోడ్డు రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు గిరిజనాభివృద్ధికి రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ కుమ్మరిగుంట నుంచి వయా సుందరాపురం, అంకుళ్లువలస మీదుగా తమ్మన్నదొరవలస వరకు 5.50 కి.మీ. వరకు బీటీ రహదారి మంజూరు చేశారు. గంగారేగువలస నుంచి దేవుని గుంప వరకు ఉపాధి హామీ నిధులు రూ.6.50కోట్ల వ్యయంతో చేపట్టనున్న మూడు కి.మీ. బీటీ రోడ్డు పనులకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గిరిజన సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారి అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. భవిష్యత్‌లో గిరిజన గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గిరిజన సంక్షేమానికి నిరంతరం పాటు పడుతున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మీ, మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, జిల్లా కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, కొమరాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మరడాన సూరపునాయుడు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, పార్టీ జిల్లా ట్రెజరర్ కళింగి మల్లేశ్వరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

కురుపాం: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం పాల్గొననున్నట్టు మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు గుజ్జువాయి రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేస్తారని, 11 గంటలకు పెదగొత్తిలి పంచాయతీలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొంటారన్నారు. 11.45 గంటలకు మరిపిల్లి పంచాయతీలో నాగరగూడకు మంజూరైన బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారని, మధ్యాహ్నం 3.30 గంటలకు బియ్యాలవలస పంచాయతీలోని షేక్ పాడు గ్రామంలో బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

డీఎస్పీ సందర్శన



ఎస్‌ఐకు సూచనలిస్తున్న డీఎస్పీ

సీతంపేట: పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. కేసులకు సంబంధించిన ఫైల్స్ చూశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఎస్‌ఐ నీలకంఠరావు ఉన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రామలక్ష్మి



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్న రామలక్ష్మి

కురుపాం: స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రామలక్ష్మి పదోన్నతిపై బాధ్యతలు చేపట్టనున్నట్లు ప్రస్తుత ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుందరరావు బుధవారం తెలిపారు. రామలక్ష్మి కొత్తవలస మోడల్ స్కూల్‌లో జువా లజీ పీజీ టీచర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారని పేర్కొన్నారు.ఆమె రెండు రోజుల్లో విధుల్లో చేరుతారని, మోడల్ స్కూల్‌లో అధ్యాపకుల కొరత కూడా తీరనున్నట్లు తెలిపారు.

విక్రాంత్‌కు అభినందనలు



విక్రాంత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాలకొండ: ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం అభినందించారు. విక్రాంత్‌ను ప్రభుత్వ విప్‌గా పార్టీ నియమించడంతో ఆమె పాలకొండలో ఆయన నివాస గృహంలో కలసి సన్మానించారు. ఆమెతో పాటు రేగిడి, పాలకొండ జెడ్పీటీసీలు ఇందుమతి, గౌరీపార్వతీ, పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, నగర పంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుమ్మలక్ష్మీపురం: చెట్టు కింద కూర్చొన్న మహిళ తలపై పాము కాటు వేయటంతో తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన కురుపాం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నీలకంఠాపురం గ్రామానికి చెందిన జి.పునాలమ్మ బుధవారం పొలం పనులకు వెళ్లి, సేద దీరేందుకు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లగా కొమ్మపై ఉన్న పాము తలపై కాటు వేసింది. విషయాన్ని అక్కడే ఉన్న కుటుంబీకులకు తెలియజేయటంతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు.

బాలికలు చదువులో రాణించాలి



బాలికా దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: బాలికలు చదువుల్లో రాణించాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పలువురి విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికలు వారికి కేటాయించబడిన హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లితండ్రులు ఆడపిల్లలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కో–ఆర్డినేటర్ బి.రాజు. అధ్యాపకులు ఎం.శాంతిశ్రీ,, కె.శ్రీనివాసరావు, పి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం, ధ్యానంతో ఆరోగ్యం



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్

వీరఘట్టం: ప్రతీ రోజు వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండొచ్చని డాక్టర్ బి.సంపత్‌కుమార్ సూచించారు. మండలంలోని గంగమ్మపేట ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. వ్యాయామం, ధ్యానం వల్ల చదువు పట్ల విద్యార్థులు ఏకాగ్రత సాధిస్తారని అన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. అనంతరం పాఠశాలలో 136 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అసిరమ్మ ఉత్సవాలు



సామూహిక ఘటాలతో అసిరమ్మ ఆలయం వద్ద భక్తులు

పాలకొండ రూరల్: స్థానిక వడమ ప్రాంతంలో గ్రామదేవత అసిరమ్మ ఉత్సవాలు వైభవంగా బుధవారం జరిగాయి. అక్కడి మహిళలు సామూహిక ఘటాలతో అమ్మవారి ఆలయ ప్రాంగణానికి చేరుకుని ముర్రాటలు సమర్పించారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన సాంప్రదాయ పులివేషాలు, డప్పు మేళాలు, అమ్మవారి అలంకరణలు ఆకట్టుకున్నాయి. కరుణించు అసిరమ్మ అంటూ భక్తితో స్థానికులు చేసిన నినాదంతో ఆ ప్రాంతం మారుమోగింది.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా లక్ష్మి

గరుగుబిల్లి: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా గంట లక్ష్మి బుధవారం ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామైఖ్య సంఘ సభ్యులతో నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా అధ్యక్షురాలిగా గంట లక్ష్మి, కోశాధికారిగా బోను స్వర్ణలత, కార్యదర్శిగా మరడాన అనసూయను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుచికరంగా గోరుముద్ద



మోడల్ స్కూల్‌లో భోజనాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రరావు

భామిని: విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రుచికరంగా జగనన్న గోరుముద్ద ఉండాలని ఎంపీడీఓ జి.చంద్రరావు అన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్‌తో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తీరుకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందుతుందా.. లేదా.. ఆరా తీశారు. వంటలను రుచి చూశారు.

హుండీల ఆదాయం లెక్కింపు



దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బంది

పాలకొండ రూరల్: శరన్నవరాత్రులు సమీపిస్తున్న క్రమంలో బుధవారం ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానంలో హుండీలను తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ పర్యవేక్షణలో చేపట్టిన కార్యక్రమంలో 17 రోజుల వ్యవధిలో రూ.1,37,648 నగదు సమకూరినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



తాలాడలో సీసీ డ్రైన్, రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ శాంతికుమారి, సర్పంచ్ ప్రభావతి, ఎంపీటీసీ ఉషారాణి

భామిని: మండలంలో పలు గ్రామాలు సీసీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎంపీపీ తోట శాంతి కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం బుధవారం భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కట్టుబడి ఉన్నారన్నారు. తాలాడకు రూ.11 లక్షలతో సీసీ కాలువ, రూ.7 లక్షలతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి, పార్టీ నాయకుడు వై.పాపినాయుడు ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.11 లక్షలతో సీసీ కాలువ, రూ.4లక్షలతో మోడల్ స్కూల్ కూడలిలో విశ్రాంతి గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. అలాగే తాటిమానుగూడ – జామిగూడల మధ్య సీసీ రోడ్డుకు రూ.2లక్షలు, ఏబీ రోడ్డు నుండి మూలగూడకు రూ.30లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు టింగ అన్నాజీరావు, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీలు పాలక ఉషారాణి, కొత్తకోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే..: సీఐ



విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు చదువుతో పాటు ఆటలను కూడా ఆడాలని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు వాలీబాల్, నెట్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులతో మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలకు కూడా సమయం కేటాయించాలన్నారు. ఆటలు ఆడడం వలన శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడం వల్ల గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ యుగంధర్, ఎస్‌ఐ షన్ముఖరావు, రిటైర్డ్ హెచ్‌ఎం జి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఆరోగ్య భద్రత



వీరఘట్టం మండలం తలవరంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న పీఓ కల్పనాకుమారి



గుమ్మలక్ష్మీపురం: చినగీసాడలో బాలింతలకు వైద్యసేవలు



పాలకొండ రూరల్: గొట్టమంగళాపురంలో జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రజలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని పలువురు నాయకులు, అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజల చెంతకే వైద్య సేవలు అందేలా అన్ని చర్యలూ తీసుకున్నారన్నారు. అవసరమైన వారికి మందులు అందజేయడమే కాకుండా, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగానే చేయించేందుకు నిర్ణయించారన్నారు. - సాక్షి నెట్‌వర్క్



భామిని: నులకజోడులోని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో బారులు తీరిన ప్రజలు



సీతంపేట: రోగులకు కేస్ సీట్ ఇస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలపై ముందస్తు అవగాహనతో నివారిద్దామని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక స్టేట్‌బ్యాంక్‌లో ప్రత్యేక డెమో బుధవారం నిర్వహించారు. కృత్రిమ అగ్ని ప్రమాదాలను సృష్టించి, వాటి నుండి సమర్థవంతగా రక్షించటం, ప్రమాదాలను అధిగమించే మెలకువలపై వినియోగదారులకు తన సిబ్బందితో కలసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ హెచ్.శేఖర్ బెహరా, డిప్యూటీ మేనేజర్ జె.రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



ఎం.సింగుపురంలో జరుగుతున్న వీధి కాలువల నిర్మాణ పనులు

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురంలో రూ.4 లక్షల పైచిలుకు జెడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచ్ రణస్థలం రమాదేవి బుధవారం ప్రారంభించారు. గ్రామంలో వీధి కాలువలు నూతన నిర్మాణ పనులు ఈ క్రమంలో చేపట్టారు. తమ సచివాలయ పరిధిలో గ్రామాల పురోభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో గ్రామంలో జరగనున్న జీజీఎం ద్వారా దీర్ఘకాల సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామన్నారు.

కంటి సమస్యలపై అలసత్వం వద్దు



డీఎం వెంకటేశ్వరరావుకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

పాలకొండ రూరల్: కంటి సమస్యల పట్ల అలసత్వం వహించవద్దని నేత్ర వైద్య నిపుణురాలు బొడ్డేపల్లి అనూష అన్నారు. పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహించింది. డిపో ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో 82 మంది ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేశారు. తగు సూచనలు అందించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇచ్చారు. కంటి సమస్యలను అధిగమించే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యూనియన్ నాయకులు బొడ్డేపల్లి శ్రీనివాసరావు, బి.ఆర్.కుమార్, వైకుంఠరావు, సతీష్ పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధి పనులను పూర్తి చేయండి : పీఓ



ఎస్.కె.పాడు నర్సరీలో పనులు పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎస్.కె.పాడు ఉద్యానవన నర్సరీ కేంద్రంలో పర్యాటకాభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న క్యాంటిన్, షాపింగ్ కాంప్లెక్స్, మరుగుదొడ్లు, ఫ్లోర్‌తో పాటు ఆర్చ్ నిర్మాణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులకు పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన నర్సరీలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. ఈ నెలాఖరులోగా మిగులు పనులు పూర్తి చేయాలంటూ తగు సూచనలు చేశారు. ఆయన వెంట టీడబ్ల్యూ ఈఈ శాంతీశ్వరరావు, భద్రగిరి డీఈ సింహాచలం, ఏఈ ఎస్.అప్పారావు ఉన్నారు.

సీపీఎస్ రద్దుకు పోరాడుదాం..



బదిలీపై వెళ్తున్న ఎంఈఓ ఆనందరావును సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

భామిని: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేసే వరకు పోరాడుదామని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు భైరి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వలరౌతు శ్రీరాములు, రమేష్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన, ఉద్యోగ విరమణ చేసిన పీఆర్‌టీయూ సంఘ నాయకుల సన్మాన కార్యక్రమంలో బుధవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటాలతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు తోట సింహాచలం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తవిటినాయుడు, రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ మాట్లాడారు. అనంతరం ఉద్యోగ విరమణ, బదిలీ అయిన వలరౌతు హరిశ్చంద్రుడు, ఎం.ప్రపుల్లకుమార్, రాగోలు ఆనందరావులను ఘనంగా సన్మానించారు.

రక్తహీనత నివారణ చర్యలపై అవగాహన



రక్తహీనత నివారణపై నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

సీతంపేట: మండలంలోని నౌగూడ గ్రామంలో స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులకు రక్తహీనత నివారణపై అవగాహన కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నాటిక వేసి విద్యార్థినులు ఆకట్టుకున్నారు. పోషకాహారం గూర్చి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలు పంపిణీ చేస్తున్న విద్యా శాఖ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని 93 పాఠశాలలకు బుధవారం వంట పాత్రలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ–2 శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి పాఠశాలకు మధ్యాహ్న భోజన నిర్వహణలో భాగంగా వంట పాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు వంట పాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వంట పాత్రలు ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేసి ఉంచాలని ఆయాలకు సూచించారు.